చట్టం ఆవలివైపున

సి.హెచ్. పాపారావు

చీకట్లో మర్రిచెట్టు నీడ చీకటిలో చీకటి కలిపి చిక్కపరచినట్లుంది ప్రక్కన పోతున్న పంటకాలువ అలలపై చీకటి తెరలుతెరలుగ ఎగురుతుంది చుక్కల నీడల్ని మింగేయాలని ఉరుకుతుంది. ఈ చీకటి శోకంలా ఉంది. రాక్షసిలా ఉంది రమ్యంగానూ ఉంది. ఎటు చూసినా నల్లటి చీకటికాంతిని కడుపులో దాచేసుకొని కళ్ళతో ప్రకృతిని పరికిస్తుంది అర్థచంద్రుడు బిక్కుబిక్కు

మంటూ చూస్తున్నాడు. వచ్చటి గాలి సీటి అలలపై ఎగురుతుంటూ చల్లగా పోతుంది చల్లటిగాలి వల్లగా ఉంది చీకటిలో చల్లని గాలిలో కూడ సన్నని చిరుచెమట బిందువులు క్షణక్షణానికి తొంగిచూస్తున్నాయి భయంతో. రాఘవ మనస్సంతా ఒక విధమయిన భయం రక్తంలో ప్లాస్మాలా జీర్ణించుకుపోతుంది ప్రతిక్షణం మనస్సంతా ఆలోచనల వల వేసినట్లుంది అంతా గజిబిజిగ పిచ్చెక్కించేట్లుంది క్షణక్షణానికి భయం, బాధ రెట్టింపవుతున్నాయి

దాని కీవిషయం ఎలా చెప్పాలి?

అది నామాట వింటుందా?

అయినా ఇది ఎంతసిగ్గుచేటు విషయం! తను నేరుచేసుకొని ఎలా ఎదగగలడు తన కిలాంటి దౌర్భాగ్యపుస్థితి కలిగించిన ఆ దేవుణ్ణి కసితీర తిట్టాలనిపిస్తుంది తనీ వెధవ పోలీసు ఉద్యోగానికి రాకుంటే ఈస్థితి కల్గకపోను బ్రతకటం ఒక సమస్యగా ఈ పనికి వచ్చి చేరాడు ఆ సమస్యే ప్రస్తుతం తనస్థితికి దిగజార్చి నైతికంగా పతనంచేస్తుంది. తనకొచ్చిన సమస్య తల్చుకుంటే గుండె చెదురు తు ది తనా పనిచేసి ఆ సమస్యను పరిష్కరించక తప్పదు తప్పదు

ఆలోచనలు అనుక్షణం బాధ్యతను గుర్తుచేస్తున్నాయి. అనుక్షణం తన గతం గుర్తొచ్చి భవిష్యత్తు గూర్చిన భయం పెంచుతుంది

• • •

తన తండ్రి తాపీపని చేసి కృంగిపోయాడు. సిమెంటు, ఇసుక వాసనలతో కడుపునింపుకొని ఊపిరితిత్తుల్లో క్షయ రోగం పెంచుకున్నాడు నలభై ఏళ్ళ వయసుకే డెబ్బై ఏళ్ళు ముంచుకొచ్చినట్లు పండిపోయి, జ్ఞాపకాలుగా రోగాలు, అనుభవాలుగా ఆరుగురు పిల్లల్ని మిగుల్చుకున్నాడు. అప్పటికి రాఘవ వయస్సు ఇరవై వయస్సు పొంగు కట్టతెంచుకుని ఉరికే వయస్సులో బాధ్యతలు బ్రతుకను కృంగతీసినయి తనే పెద్ద కొడుకు తన తర్వాత పుట్టిన ఇద్దరు ఆడపిల్లలు కోర్కెలు గుండె ల్ని మండించే వయసులో అడుగుపెట్టారు. నోట్లోకి నాల్గువ్రేళ్ళు వెళ్ళటం కష్టమయి చివరకు పోలీసు జవానుగా చేరాడు

ఆ ఊర్లో చిన్న స్టేషన్ హవుస్‌లో పోస్టింగ్ వచ్చింది. ఆ ఊరు అంత పెద్దది అంత చిన్నది కాదు. పల్లెటూరుగానే పరిగణించవచ్చు జనాభా ఒక అయిదారువేలు ఉంటుంది. ఊరు ముచ్చటగా, పచ్చటి పంటలతో కళకళలాడుతూ ప్రగతి ప్రతిబింబంలా ఉంటుంది ఆ ఊరు చూసి తన కెంతో ముచ్చటవేసింది.

ఆ స్టేషన్‌లో ఒక హెడ్ కానిస్టేబుల్, ఒక రైటర్, నల్గురు కానిస్టేబుల్స్ ఉన్నారు. హెడ్ జకరయ్య నల్లగా బలిసిన తుమ్మమొద్దులా ఉంటాడు. గారపట్టిన పళ్ళు నవ్వినపుడు బయటపడి

వికృతంగా కనిపిస్తాయి కళ్ళలో ఎర్రటి జీరల్లో అధికారదర్పం కొట్టొచ్చినట్లు కన్పిస్తుంది రైటర్ రామచంద్రం ఎంతో మర్యాదయిన మనిషిగా ప్రవర్తిస్తాడు అతనికి కొండముచ్చని నిక్‌నేమ్ ఇక మిగిలిన నల్గురు కానిస్టేబుల్స్ భద్రయ్య జాన్, హసన్, రాముడు. తమపనేదో తామేదో అన్నట్లు ప్రవర్తిస్తారు

మొదట్లో జీవితమెంతో సుఖంగా సాగిపోయింది అప్పుడప్పుడు పైడబ్బులు దొరికినయి తనిక జీవితంలో పూర్తిగ స్థిరపడ్డా ననుకున్నాడు పున్నమ్మ వెన్నెల్లో వెలిగే పొన్నపువ్వులాంటిది నల్లటి ఛాయలో లేతవయస్సు మెరుస్తుంటుంది నల్లటి పెద్ద కళ్ళలో తెల్ల గుడ్డు వెన్నెల్లా, నల్లపాప చీకటిమరకలా అద్భుతంగానూ వింతగానూ కన్పిస్తుంటుంది పల్చటి పెదవులమీద పల్చటి చిర్నగవు ఆమె మనస్సు చిర్నవ్వులా అందమయినదే ఆమెతో జీవితం ఎంతో ఆనందాన్నిస్తుంది జీవనకాలం ఒక వసంతం ఊహించనంత వేగంగా తిరిగిపోయింది

జీవితం యొక్క రెండవవైపు అసలు స్వరూపం బయటపడుతుంది చేదు అనుభవాలు ఎదురవుతున్నయి. ఆ ఉద్యోగం ఒక విధంగా వెట్టిచాకిరిలాంటిదే హెడ్ ఇంట్లో పనులుచేయాలి విజిటింగ్ కొచ్చే ఆఫీసర్లకు అడుగులకు మడుగులొత్తాలి. మిగతా కానిస్టేబుల్స్ కొత్తగా వచ్చిన వాళ్ళచేత తమ డ్యూటీలు చేయించుకుంటారు నైట్ డ్యూటీలు ఎక్కువగా వేస్తారు

హెడ్ చేయించుకోని పని అంటూ ఉండదు కేసులు దొరక్కపోతే అతను తిట్టే తిట్లు తిట్లుకావు అతి క్రూరంగా, అసహ్యంగా తిడతాడు ఒక్కోసారి ఈ బ్రతుకు నుంచి తనకు పారిపోవాలనిపిస్తుందేది కాని తనచుట్టూ అతలు అల్లుకొని బ్రతుకుతున్న తల్లీ, తండ్రీ, తమ్ముళ్ళు దీనంగా కళ్ళ ముందు కదులుతూ తనను బంధించేవారు

రోజురోజుకు పని ఎక్కువయిపోతుంది నెలాఖరు వస్తుంద టే గుండె దడ ఐకరయ్య అదమాయింపులు ఎక్కువ అవుతున్నాయి కేసులు దొరకవు సి ఐ ఇన్స్‌పెక్షన్‌కు వస్తున్నాడట, రామచంద్రయ్య చెప్పాడు. మిగతావాళ్ళకు కాస్త కూస్త పలుకుబడి ఉండటంవల్ల పని చేయకున్నా ఎవ్వరూ పట్టించుకునేవారు కాదు తనే ఏ దిక్కూలేక పొరుగూరునుంచి వచ్చి ఉద్యోగం చేస్తున్నాడు దానికి తోడు సర్వీసు కూడ తక్కువ కావటంతో అందరూ చులకనగ చూస్తున్నారు

ఈసారి నెలాఖరుకు కేసులు పట్టాల్సిన బాధ్యత తనమీద పడింది పాత ఖయిదీలను పట్టుకొని క్రొత్త కేసులు బనాయించి చార్జిషీట్లు తయారు

చేయించాడు పల్లెటూర్లలో జరిగే నేరాలు తక్కువ పట్టణాలలో అయితే ఏదో ఒక నెపం చూయించి పట్టుకోవచ్చు ఇక్కడలా చేయటం కష్టం. దానికితోడు ఎవరికెలాంటి బలాబలా లుంటయ్యో సరిగా తెలియదు. ప్రాస్టిట్యూషన్ కేసులు లేవని తెగ చిరాకుపడుతున్నాడు జకరయ్య. ఇంట్లో భార్య లేనపుడు ఆ కేసులు పట్టమని పంపుకుతింటాడంట మొన్న మూడు నెలల క్రితం అలానే వేధించాడు అప్పు డెలానో సర్ది చెప్పాడు. కాని ఈసారి అలా ఊరుకునేట్లు లేదు. మెమొ ఇస్తానంటున్నాడు. మొన్న ఎంతో కష్టపడి ఒంటరిగ వస్తున్న ఆడమనిషిని అనుమానం మీద తీసుకెళ్తే నానా రభసా అయ్యింది. ఆవిడ సర్పంచి బంధువంట బంధువులింట్లో మనస్పర్థలొచ్చి తన ఇంటికి బయల్దేరిందంట అదెంతవరకూ నిజమో కాని తన బ్రతుకు, పరువు వీధిన పడేసేసింది. ఆ రోజు జకరయ్య నానా బూతులు తిట్టాడు. అవి ఇపుడు తల్చుకుంటే వళ్ళు జలదరిస్తుంది ఆ క్షణం అతనిమీద పడి పీక పిసికి చంపేసి పారిపోవాలన్నంత కసి పెరిగింది. కాని తనలో అంత గుండెబలం ఏది?

కేసులు విషయమై వారం రోజుల్నుంచి హెచ్చరిస్తున్నాడు రేపు చివరి రోజు ఎల్లుండి సి ఐ వస్తాడు ఏం చేయాలో తోచటల్లేదు. ఆలోచిస్తున్న కొద్దీ పిచ్చెక్కేలా ఉంది

ఎవరినన్నా సంప్రదించాలి ఎవరున్నారు తనకు సలహా ఇవ్వటానికి. రాత్రి భద్రయ్య నడిగితే చెప్పిన పనే చెయ్యాలి. అతను చాలా సేపు ఆలోచించి తనకా సలహా ఇచ్చాడు. తనొకసారి అలా నే చేశాడంట అతను చెప్తుంటే గుండె ఓ క్షణం ఆగిపోయింది. అంత నీచమయిన పని తను చేయగలడా! అనిపించింది అయినా దాన్నెలా ఆదగటం ఈ 'బతుకు బ్రతకటం కన్న చచ్చిపోవటం నయం అనిపిస్తుంది కాని చచ్చిపోయేంత తెగువ తనలో లేదు. తను పిరికివాడు

చావును తల్చుకున్న కొద్దీ బ్రతుకు మీద ఆశ పెరుగుతుంటుంది బ్రతకాలన్న తపన పెరుగుతుంది అతనిలోను అదే తపన ఈ బ్రతుక్కి అర్థంలేకున్నా సార్థకతలేకున్నా ఏదో వెర్రివ్యామోహం ప్రవేశించి మనిషిలో నున్న నైతిక స్థితి నుంచి దిగజార్చి మరీ బ్రతికిస్తుంది. ఆ తపన, వ్యామోహం ఆలోచిస్తున్న కొద్దీ చావు భయంతోపాటు పెరిగిపోతున్నాయి రక్తంలోని కణాలన్నీ బ్రతకమని ప్రోత్సహిస్తున్నాయి ఆ ప్రోత్సాహం నైచ్యాన్ని సైతం ఆచరిస్తుంది. అతనా స్థితికి దిగజారాడు ఆమెకు ఆ విషయం చెప్పి చేయమని ప్రార్థిసాడు వినకుంటే భర్తగా ఆజ్ఞాపిస్తాడు.

'తప్పదు. చెప్పక తప్పదు.'

లేకుంటే బ్రతుకు వ్యామోహం



అతన్ని చంపేస్తుందన్న భయం. అంత వరకూ సాగిన ఆలోచనలకు అతని నిర్ణయం ఆనకట్ట వేసింది.

అప్పటికి ఊరు పూర్తిగ నిద్ర పోయింది చీకటిలో తల్లిఒడిలో పిల్ల లాగ పున్నమ్మ తన కోసం ఎదురు చూస్తుంటుంది తనెళ్లి ఎలా చెప్పాలి? అనే ప్రశ్న మళ్ళీ తలఎత్తుతుంది. దాని నల్లటి కళ్ళల్లో నవ్వుల నీడల్ని చూస్తూ తనెలా అడుగగలడు

'మామా, ఇంతకన్న నన్నొక్కమారు చంపేయరాదా!' అని అంటే తానేమని బదులు చెప్పగలడు.

'పున్నా! ఆడదాని ప్రాణం కంటె మానానికి వెలువెక్కువే. నువ్ చచ్చి పోతే నా సమస్య తీరుతుందా' అని ప్రతిమాలి బుజ్జగించి ఆ పనికి ఒప్పించాలా?

తనా పని చేయలేడు?

చేయలేడు?

మరి ఎలా?- బ్రతుకు మీద మమ కారం వేస్తున్న ప్రశ్న

ఈ ఉద్యోగంవదులుకుంటే అందరూ ఆకలితో చావాలి ఎండి ఎండి చావాలి. అంతటి భయంకరమయిన చావు తాను భరించలేడు.

'అయితే ఏం చేయాలి?'

స్వార్థం ప్రశ్నలతో రెచ్చగొడు తుంది మనస్సు సంద్రంలా ఎగిరి పడు తుంది తన కోసం, తనవాళ్ళ కోసం, భవిష్యత్తు కోసం ఎవరో తల్లి కన్న బిడ్డను తను బలి తీసుకుంటున్నాడు.

అసలు తనకా అధికారం ఎక్కడిది. తను కట్టిన పసుపు తాడుదా! అది అంత పవిత్రమయిందా! అయితే తను ఎందు కిలా అతి నీచమయిన పనికి ఆ పవిత్రతను బలి తీసుకుంటున్నాడు.

'స్వార్థం' మనస్సు మథనలో స్వార్థం గెలిచి మానవత్వంపై దురాక్రమణ జరిపి విజయ పతాకం ఎగరవేసింది ఓడిపోయిన ఆత్మ మూలుగుతూనే ఉంది కంటికి కనిపించక అరిచే కీచురాయిలా మూల్గుతూనే ఉంది దానిని తాను గుర్తించడు. గుర్తిస్తే తాను బ్రతకలేడు.

ఆలోచనం సుడినుంచి లేచి ఇంటికి బయల్దేరాడు అతని ప్రయాణం చీకట్లో నుంచి చీకట్లోకే. ఎప్పటికీ చీకటిలోకే. తను చీకటిలో కలిసిపోయేదాక చీకట్లో కరిగిపోయేదాక. ఒక్కొక్క అడుగు ముందుకు పడుతుంటే రక్తం వేగంగా పరిగెత్తుతుంది. గుండె బరువవుతుంది రక్తం చెమటగామారి వళ్ళంతా భయంతో తడిపేస్తుంది ఇల్లు దగ్గరవుతున్న కొద్దీ కాళ్ళు బరువవుతున్నాయి. వాకిట్లో తెల్లటి చీరెలో పున్నమ్మ చీకట్లో దీపంలా మెరుస్తుంది. అతన్ని చూసిన ఆమె కళ్ళు తళుకులు కురిపిస్తున్నాయి అతని కెదురొచ్చి 'ఏం మావా! ఇంత ఆలస్యమయిందే' అని ప్రశ్నిస్తుంటే గుండెల్లోని ఆర్ద్రత పొంగిమాటల్లో తొంగిచూస్తుంది.

అతనేం సమాధానం చెప్పలేదు.

"స్నానం చేస్తావా. వేడినీళ్ళు పెట్టాను" ఆమె

"ఇపుడొద్దులే. చన్నీళ్ళు చేస్తాను."

"జలుబు చేస్తదేమో. అసలే కాస్త చలిగాలి ఈస్తుంది."

"పర్వాలేదులే." దానికేం తెలుసు తనలో ఉన్న అలజడి. ఆ అలజడి అణుచుకోవటానికే చన్నీళ్ళను.

అతను స్నానం చేస్తున్నంత సేపు ఆమె ఏవేవో అడుగుతూనే ఉంది. అతను అప్రమత్తంగా సమాధానాలిస్తున్నాడు. ఆమెలో అనుమానం పొడచూపింది.

"ఏంటి మావా! అట్టాగున్నవ్?"

ఆ ప్రశ్న కతను తత్తరపడ్డాడు. ఏమని సమాధానం చెప్పగలడు. మౌనంగా ఊరుకున్నాడు. ఆమె మరి ఇక ప్రశ్నించలేదు. అతను స్నానం చేసి భోజనంచేసి ఇంటి వెనక వడవలో పడుకునే దాకా ఇద్దరూ ఏం మాట్లాడుకోలేదు. ఆమె అతని ప్రక్కనే కూర్చుని అతన్ని చూస్తుంది అతను మాత్రం ఆమెను చూడలేక దూరంగా ఉన్న చుక్కల్ని లెక్కపెడుతున్నాడు.

"మావా!" ఆమె కళ్ళతోను, పెదవులతోను పిలిచింది. అతను మాత్రం గుండెలో 'ఊఁ' అనగలగాడు. ఆమె అతని ఛాతీపై తల ఉంచి పడుకుంది మెత్తని చెంపలు అంతకన్న మెత్తని ఊరువులు వత్తుగా తగులుతున్నాయి. ఆమె విడిచే ఊపిరి వాడి నిట్టూర్పులా ఉంది. ఆ స్పర్శలో అతని కేమాత్రం అనుభూతి కల్గటల్లేదు. అతనిలో ఎలాంటి పంచలనం లేదు. అది శరీరమయితే కదా! కేవలం రక్త

మాంసాల ముద్ద. స్వార్థం తప్ప మరేం లేని క్షుద్రశక్తుల కుప్ప.

ఆమె కళ్ళల్లో నీళ్ళు సుడులు తిరుగుతున్నాయి.

"మావా! నీ బాధ నాకు చెప్పవా!" అని అడిగింది.

"పున్నా! నా గుండె నీకేం చెప్పట ల్లేదా!" అని అడగాలనుకున్నాడు. కాని అడగలేదు.

"ఈ గుండె భాష నా కర్థమయితే ఎంత బాగుండును. మామ బాధ నాకు తెలిసేది కదా." అని ఆమె ఓక్షణం బాధపడింది. అతనికింకా దగ్గరగా జరిగి చేతి వ్రేళ్ళతో మీసకట్టు సవరిస్తూ అతని కళ్ళల్లోకి చూస్తూ కళ్ళయినా బదులు చెపుతయేమోనని భ్రాంతిపడింది. అని కళ్ళయితేనే కదా! గాజుముక్కలు.

అతనికి ఏం మాట్లాడాలో తెలియట ల్లేదు. చాలాసేపు మౌనంగా ఉన్నాడు. తనలో తను ధైర్యపరుచుకుంటున్నాడు. గొంతులో మాటలు తడితడిగా తయారై ముద్దగ వస్తున్నయి.

"పున్నా!"

"మావా!"

కాసేపతను ఏమీ మాట్లడలేదు.

"పున్నా, నిద్రవస్తుందా!"

"లేదు మావా!"

"నేనొకటి చెపుతాను వింటావా!"

"చెప్పు మావా!"

"మనం ఇంత దరిద్రులం ఎందు కయ్యాం?"

"అంతా దేవుడి దయ మావా!"

"ఆ దేవుడుంటే మనం ఇంత మొక్కుతున్నా పలకడేం పున్నా అసలు దేవుడు లేడు పున్నా. మనిషే మనిషి భవిష్యత్తును నిర్ణయిస్తాడు అధికారి తనక్రింద ఉద్యోగుల భవిష్యత్తు నిర్ణయిస్తాడు. ఇక దేవుడి నిర్ణయాలకు తావెక్కడిది పున్నా!"

"................."

"చూడు పున్నా! మనిషి తాను ఎందుకు చచ్చిపోతను అనుకుంటాడో తెలియదు. చచ్చిపోవటంతో సమస్యలు తీరిపోతయ్యని అతనికి తెలియదా."

"అదేమిటి మావా! అట్లా మాట్లాడు తున్నావ్!"

"పున్నా! నేను చచ్చిపోతే నాకున్న సమస్యలు తీరిపోతయి కదా! కాని నేను చచ్చిపోలేను. నేను పిటికివాడ్ని. నా కది చాతకాదు. ఎంత నీచమయిన బ్రతు కయినా బ్రతకటానికి సిద్ధపడుతాను కాని చచ్చిపోలేను కదా!"

"మావా!" ఆమె కంఠంలో భయం.

"పున్నా! నే నెన్నో మాటలుపడుతూ ఈ ఉద్యోగం చేస్తున్నాను. నా వ్యక్తిత్వం చచ్చిపోయినా బాధపడలేదు. ఆఖరికి ఈ ఉద్యోగం చేయటానికి ఇంత నీచస్థితికి నన్ను నేను దిగజార్చుకుంటు న్నాను. నన్ను క్షమించవూ!"

"మావా! నీ మాటలు నాకేమీ అర్థం కావటల్లేదు!"

"ఇవి మాటలు కావు పున్నా. ఇంత కన్న నే నెలా చెప్పగలను. పున్నా, నాకోసం నువ్వేమయినా చేయగలవా!"

"నీ కోసం ఏమయినా చేయగలను మావా!" ఆమె కంఠంలో ఏదో ఉద్రిక్తత ప్రవేశించింది.

"నా స్వార్థంకోసం నా వాళ్ళకోసం నిన్ను పణంగా పెట్టుకొంటున్నాను పున్నా నిన్ను నేను బలితీసుకుంటున్నాను. ఆ భగవంతుడు కూడ నన్ను క్షమించలేడు. ఈ స్వార్థపిశాచాన్ని నీవు క్షమించద్దు. నన్ను క్షమించవద్దు పున్నా" అతను ఆవేదనతో తల్లడిల్లుతున్నాడు.

"చెప్పు మావా! నన్నేం చేయమంటావు నా ప్రాణా న్నిమ్మంటావా!"

"పున్నా! ఆడదాని మానానికున్న విలువ ప్రాణానికెక్కడుంది!".

"ఏమిటి మావా! నువ్వనేది. ఏం చేయాలి నేను. చెప్పు మావా" ఆమె కన్నులలో భయం, ముఖంలోను, పెదవులలోను, చెక్కిళ్ళలోను, కనురెప్పల్లోనూ భయం.

ఎలా చెప్పాలో తోచక మాటలు తడుముకుంటున్నాడు. తరతరాలుగా స్త్రీని పురుషుడు ఆస్తిగా వాడుకున్నాడు. మట్టిబొమ్మతో ఆడుకున్నట్లు వాడుకున్నాడు స్త్రీని. తనని ఎంతో గాఢంగా ప్రేమించిన ఈ పొన్నపువ్వుని దూరంగా అందరూ నడిచే దారిలోకి విసిరికొడుతున్నాడు "ఓ కాఠిన్యమా? ఎంతటి భయంకరమైనదానవు నీవు!" అని అనిపిస్తుందతనికి. తప్పదు చెప్పక తప్పదు తన భవిష్యత్తుకు ఆమె పునాది రాయిగ వేసుకోక తప్పదనిపించింది:

"నిన్ను వ్యభిచారిగ పోలీసుస్టేషన్‌లో హాజరుపర్చాలి!" అని మాత్రమే అనగలిగాడు. అతని మాటలు ఆమె గుండెలకు గుచ్చుకున్నాయి. కళ్ళల్లో కన్నీరు ఇంకిపోయి ఆ చూపులు బిత్తరపోయినయి. పెదవులు శోకంతో వణుకుతున్నయి. ఆమెలోని చైతన్యం చచ్చిపోయి సుషుప్తి ఆవరించినట్లుండిపోయింది. చీకటిలో చీకటిలా నిల్చిపోయింది.

"మావా! ఒక్కసారిగా చంపేయరాదు" అని అడిగింది ఆమె ఆ కంఠంలో తెగింపు. సుఖాదుఃఖాలు ఏమీ లేవు. కళ్ళనిండా ప్రశాంతత. దైన్యం గుండె నిండా.

"నిజమే పున్నా! నిన్ను చంపి నేను చచ్చిపోతే ఎంతో బాగుంటుంది కాని మన సమస్యలు చస్తే తీరవే నా తల్లి, తండ్రి, తమ్ముళ్ళు అందరూ అన్నమో రామచంద్రా అంటూ బిచ్చమెత్తుకుంటూ తిరగాలి మనిషి ప్రాణం కన్న ఈ దరిద్రం, ఆకలి విలువయినవి. అందుకనే ఈ వెర్రి తాపత్రయం"

ఆమె ఏమీ మాట్లాడలేదు. తను ఎన్నో సార్లు అతనికి చేదోడువాదోడుగా ఉంది. డబ్బు చాలక సంసారం గడవ

నపుడు తను కూలికెళ్ళేది. డబ్బవసర మయితే తను పసుపుకొమ్ము కట్టుకొని మంగళసూత్రాలు అమ్మింది. అపుడు త నేమాత్రమూ బాధపడలేదు. కాని ఇపుడు తన భర్తే తనని వ్యభిచారని సమాజానికి పరిచయం చేస్తున్నాడు. ఇంత కాలం నమ్మి ప్రేమించినందుకు అతనామెకు ఇస్తున్న కానుకిది.

ఇది ఇప్పటి విషయం కాదు.

ఎన్నోసార్లుగ పు రు షు డి లా నే ప్రవర్తిస్తున్నాడు పురాణాల్లోనూ, చరిత్ర లోనూ పురుషుడి ప్రవర్తన ఇలానే ఉంది. గతం, వర్తమానం, భవిష్యత్తు వీటి అన్నిటిలోను ఎక్కడా పురుషుడిలో మార్పు కానవచ్చే ట్లులేదు. స్త్రీ పురుషుడు కోసం ఎపుడూ ఆవేదన, జాలి పడుతూనే ఉంది తనని త్యాగం చేసుకుంటుంది. ఈ త్యాగానికి ఎవరు విలువ కట్టారు ప్రపంచ ధనరాసులన్నీ కొల్లగొట్టు కొచ్చి ఆమె పాదాలమీద పోసినా ఆ ఋణం తీరదు. ప్రకృతిశోభ కామెను రాణిని చేసినా ఆ ఋణం తీరదు. స్త్రీకి పురుషుడు ఎప్పుడూ బాకీయే. పురుషుడు తనెంతగా తన ప్రతిభకు మురిసిపోయినా స్త్రీ ఔన్నత్యానికి ఎపుడూ సాటిరాదు.

పున్నమ్మ చాలాసేపు ఆలోచించింది చింది. తను అతని మాట కా ద ం టే ఆమెను అంతగా ప్రేమించలేడు ఆ ప్రేమ లేనిదే తను బ్రతుకలేదు. ఆ ప్రేమ కోసం తను త్యాగం చేస్తుంది. కాని అతనిలో ప్రేమ లేదే. అది ఎండి పోయిన మధుపాత్రికని ఆమెకు ఎ లా తెలుస్తుంది దాని అంచులు స్వార్థంతో చిట్లిపోయినయి. ఆ పాత్రిక ప్రేమ మధువు పోయటానికి పనికిరాదని ఆమె కెవరు చెప్తారు. తన త్యాగం వృధాయే నని ఆమె కెట్లా తెలుస్తుంది

త్యా గం జీ వ న పరమావధిగ నిర్ణ యించుకున్న ఈ స్త్రీ ఎపుడూ ఉత్తము రాలే. ఆమె తీసుకున్న నిర్ణయం అద్భు తమయినదే ఏ స్త్రీ చేయ సాహసించని త్యాగమది దాని విలువ కొన్ని ప్రాణాలు ఆమె ఆశించింది పిడికెడు గుం డె కు ప్రేమ

తాను జైలుగదిలో కష్టాలనుభవించే వారి ఎందరి కథలు వింది. అక్కడ జరిగే అ మా ను షా లు వింది. తాను పవిత్రంగా రాలేనినాడు, అపవిత్రమయి నపుడు ఆమెలో బ్రతకాలనే వాంఛ కూడా ఉండదు. ఇవన్నీఆలోచించి నిర్ణయించు కొని గుండె దిటవుపర్చుకొని కన్నీళ్ళ చారికలు తుడుచుకొని అతని కళ్ళల్లోకి చూసింది. అతని కళ్ళు మౌనంగా ఏడుస్తున్నాయి

"మావా!"

అతను పలుకలేదు

"నీయిష్టం మావా!"

అతను కళ్ళు తెరిచాడు. అతని కళ్ళ కామె కనపడలేదు ఏదో అఖండమయిన వెలుగు కనిపించింది. ఆ వెల్గు నతడు

చూడలేదు. చూసి భరించలేదు. కళ్ళు మూసుకునే "నన్ను క్షమించవూ?" అన్నాడు.

ఆమె అతనికి దగ్గరగా జరిగింది. అందులోనే క్షమాపణ ఉన్నది. అతనామె తలను మెల్లిగా నిమిరాడు

"మావా! నన్ను మర్చిపోవుకదూ?"

"నిన్నెలా మర్చిపోతాను పున్నా. నిన్ను మర్చిపోతే నన్ను నేను మర్చిపోయినట్లు కదా."

"మావా! మరో జన్మంటూ ఉంటే మళ్ళీ మనం ఇలానే .."

"పున్నా! నిన్ను నేను జైలు నుంచి వదిలంగా తెచ్చుకుంటాను"

"నాకు నమ్మకం లేదు మావా! మనకిదే చివరి కలయిక అనుకుంటాను. మావా! ఆ ఆకాశం చూడు. ఎంత అందంగా వంగింది నేలనందుకోవటానికి నేను నీకోసం అలా వంగి నీలో కలిసిపోతాను మావా! మన కలయికలో మెరుపులు మెరిసి కాంతిని కురిపిస్తయి కదూ! చూశావా మావా! రాబోయే ఎడబాటు తల్చుకుంటే మనస్సు ఎంతగా ఊగిపోతుందో చూశావా మావా!" ఆమె వెచ్చటి ఊపిరి అతనికి ఊపిరయ్యింది. ఆ ఊపిరిలోనే అతను మసలుతున్నాడు ఆమె ఆవేశంతో, ఆవేదనతోను పొంగి పొంగి అతనిలో కలిసిపోయింది. ఒక జన్మ ఎడబాటు భరించటానికి సిద్ధపడుతూ.

• • •

ప్రతిరోజులా ఆ రోజు తెల్లారింది. ఎర్ర సూర్యుడు తూర్పు కొండలపై అమాయకంగా తేలాడు.

అతను నిద్ర లేచి చొక్కా కయిన కుంకుమ మరక రోజులా తుడిచివేయలేదు అది కనపడకుండా చెయ్యడ్డం పెట్టుకొని లోనికెళ్ళాడు. అప్పటికే అతనికోసం ఆమె ఎదురు చూస్తుంది. పల్చటి కురులు తలస్నానం చెయ్యటం వల్ల నుదుటమీద అతుకుంటున్నయి. రోజుకన్న వెడల్పయిన బొట్టు పెట్టుకుంది. కాలి బొటనవ్రేళ్ళకు పసుపు రాసుకుంది

అతని ముందు ఆమె దేవతలా సాక్షాత్కరించింది పెదవులపై చెరగని చిర్నగవు. అతను ఏదో చెప్పాలనుకుంటున్నాడు. తనని క్షమించమని పదే పదే వేడుకోవాలనుకొంటున్నాడు. కాని అడగలేకపోతున్నాడు సిగ్గుతో తల వంచుకొని అక్కడ్నించి కదిలాడు. ఆమెను ఎలాగయినా చాలా జాగ్రత్తగా మరల విడిపించుకోవాలి. అదే అతని ఆలోచన ముఖప్రక్షాలన కానిచ్చేసరికి పళ్ళెంలో అన్నం కల్పి ఉంచింది. అతను ఆమె ఎదురుగా కూర్చున్నాడు. ఏమీ తినాలని అనిపించలేదు. ఆమె నోటికి ఒక ముద్ద అందించాడు. అందులో సగం మాత్రమే తినింది. మిగతాది తను తిన్నాడు. ఆమె కళ్ళు కన్నీటిని బలవంతంగా ఆపుతున్నయి. అతనిది అదే స్థితి. గుండె



దిటవుపర్చుకోవటానికి ప్రయత్నిస్తున్నాడు.

అతను యూనిఫారమ్ వేసుకొచ్చే వరికి ఆమె సిద్ధంగా ఉంది. అతను మౌనంగా కదిలాడు ఆమె అతన్ని అనుసరించింది ఇండ్లోవాళ్లు అంతా వింతగా చూస్తున్నారు. వారిద్దరూ దారిలో ఏమీ మాట్లాడలేదు. ఒక్కటే ఆలోచన. ఆమెను పదిలంగా తెచ్చుకోవాలని తర్వాత తర్వాత మెల్లగా జకరయ్యకు నచ్చచెప్పి విడిపించుకోవాలి. ఇవే అతని ఆలోచనలు ఆమె మాత్రం ఏం ఆలోచించటంలేదు. లక్ష్మణుడి చేత అడవిలో విడిచిపెట్టిన 'సీత'లా ఉంది ఆమె. అతన్ని మౌనంగా అనుకరిస్తుంది.

స్టేషన్ చేరేవరికి ఇంకా ఎవ్వరూ రాలేదు. రాత్రి డ్యూటీ చేసిన భద్రయ్య అతన్ని జాలిగా చూసి బాధపడవద్దని చెప్పి డ్యూటీ రాఘవకప్పగించి వెళ్ళిపోయాడు. అతనామెను సెల్‌లోకి తీసికెళ్ళి కూర్చోపెట్టాడు. కొద్దిసేపటికి జకరయ్య వచ్చాడు. రాఘవ అతనికి సెల్యూట్ చేసి నిలబడ్డాడు.

"కేసులు పట్టావా!" హూంకరించాడతడు.

"యస్ సార్! బ్రోతల్ కేసు." అతని ప్రయత్నం లేకుండానే అధికార దర్పానికి భయపడి మాటలు వచ్చేస్తున్నాయి.

"తీసుకురా" మళ్ళీ అరిచాడు.

అతను సెల్లోంచి తీసుకొచ్చాడామెను. ఆమె తలవంచుకొని ఉంది. ఆమెను చూడగానే జకరయ్య కళ్ళలో మెరుపులు మెరిసినయి. పెదవులు వెకిలిగ నవ్వినయి.

"ఇదేనా ఆ లంజ. ఆ మిండిదేడి!"

"దొరకలేదు సార్. పారిపోయాడు"

"కొత్తకొడుకా నువ్వేం చేశావ్?"

కొత్తకొడుకు అనేది అతనికి ఊతపదం. అందరినీ అంటూంటాడు. ఎవ్వరూ అతనికి ఎదురు తిరగలేదు.

"అదికోసం వెళ్తే ఇది పారిపోతదని వెళ్ళలేదు సార్."

"ఎక్కడ పట్టుకున్నావ్."

"పెద్దమర్రికాడ."

"ఆరు బయటా? ఏవేం లంజ! మీకు ఒళ్లు కొవ్వెక్కుతుంది." జకరయ్య కసిగా తిట్టాడు అందులో అతని కేదో ఆనందం కనిపిస్తుంది.

"ఎన్నింటికి దొరికింది."

"అయిదింటికి సార్."

"సిగ్గులేవియ్యి తెల్లారేదాక కుతి తీరలేదంటే .. ఊఁ నువ్వు అపుడు డ్రస్‌లో ఉన్నావా?"

"లేను సార్."

"ఎందుకు లేవురా కొత్తకొడుకా!"

"డ్యూటీ నాది కాద్సార్"

"మరీ ముండనేం చేసావు. నీ ఇంటికి తగులు తెళ్ళావా! మరేం చేశావు?"

"సెల్‌లో వేసి వెళ్ళానండి"

"రైటర్ వచ్చాక అన్ని వివరాలు చెప్పు."

"యస్ సార్"

అతను లేచి వచ్చి ఆమెను నఖశిఖ పర్యంతమూ చూశాడు. అతని కళ్ళల్లో ఏదో వింత మెరుపులు. ఆమె వంచిన తల ఎత్తలేదు.

"నీ పేరేటి". జకరయ్య.

ఆమె మాట్లాడలేదు.

"చెన్నమ్మంట సార్" - రాఘవ.

"ఏ ఊరు"- జకరయ్య

"........" పున్నమ్మ.

"ప్రక్కనున్న లంక సార్" రాఘవ.

"కొత్తకొడక, అడిగింది దాన్ని" కసిరాడు జకరయ్య. అతనికి చిరాగ్గాను, కోపంగాను ఉంది. తప్పు చేసి కూడా పొరపాటయిందని కాళ్ళా వేళ్ళా పడక దెయ్యమల్లే నిలబడి ఉందని కసిగా ఉంది

"మాట్లాడవేమే లంజా." అంటూ చేతిలోని లాఠీతో భుజంమీద పొడిచాడు. ఆమె కదల్లేదు. అతనికి చిరాకెక్కువయ్యింది. ఆమె చుబుకం క్రింద లాఠీ పెట్టి ముఖం పైకెత్తాడు. ఆమె కళ్ళ నిండా గంభీరత. నుదుట కుంకుమ ఎర్ర సూరీడులా మెరుస్తుంది.

"పెళ్ళయిందా"

"..............."

"మొగుడున్నాడా?"

"లేదు" ఆమె పలికిన మొదటి అక్షరాలు చాలా సంక్షిప్తంగా వచ్చినయి- ఆ మాటలయినా. ఆ సమాధానానికి రాఘవ విస్తరపోయాడు. శరీరం అంతా భూమిలోకి కృంగిపోయినట్లవుతుంది. ఆ సమాధానం తన చేతకానితనాన్ని వేలెత్తి చూపించింది.

జకరయ్య అర్థంలేని ప్రశ్నలు వేస్తున్నాడు. లాఠీతో మెడలోఉన్న తాళి బయటకు లాగాడు.

"మరి ఇదెందుకే లంజ పెద్ద పత్తిత్తు రాగ" అని కసిగా లాగాడు. అది తెగ లేదు బలంగ పేనిన త్రాడది. మనుషుల మధ్య ఉన్న బంధం కన్న బలమైనది. అది తెగకపోవటంలో అతనికి చిరా కేసింది. కసిగా త్రెంచేద్దామనుకున్నాడు. తన అసిస్టెంటుండగ తను ఆ పని చేయటం ప్రిస్టేజిలా అనిపించింది.

"ఇది త్రెంచి విసిరికొట్టవోయ్."

రాఘవ శిలలా నిలబడ్డాడు జకరయ్య ఇచ్చిన అజ్ఞ శూలంలా తగిలింది. ఓ క్షణం కదలిక కోల్పోయాడు. "పోనీ యండి సార్. ఉంచుకోనీయండి." భయంగా నెమ్మదిగా పలికాడు. అతని సమాధానం జకరయ్యలో చిరాకును రెట్టింపు చేసింది.

"చెప్పింది చెయ్యవోయ్" అసహ నంగా అరిచాడు.

తప్పదు. చేయాలి అతని చేతులు వణుకుతున్నాయి అమె కెదురుగ వచ్చి నిలబడ్డాడు. ఆమె తలఎత్తి కళ్ళల్లోకి చూసి కళ్ళతోనే జాలిగా నవ్వింది. అతని చేతులు కదలలేక పోతున్నాయి. చేతులు భారమయి పోతున్నాయి. తన చేతులు తనే మొయ్యలేకపోతున్నాడు. ఊపిరి అగిపోయేలా ఉంది. ఆమె కళ్ళు ఇంకా నవ్వుతూనే ఉన్నాయి. అతని కళ్ళు ఆమెను చూడలేకపోతున్నాయి. కళ్ళు చుట్టూ ఏవో మంటలు అల్లుకుపోయి నట్లుంది. ఆమెను చూస్తూంటే మృత్యువు చూస్తున్నంత భయం కల్గుతుంది. తల బరువెక్కిపోతుంది. చేతులు అ త్రాడును అందుకోలేకపోతున్నాయి. ఆమె ఆ త్రాడును అతని చేతుల కందించింది. అది ఏమిటి?

కేవలం రెండు శరీరాలను కల్పి ఉంచే బంధమే కాదు. పవిత్రతకు చిహ్న మయిన బంధం మాత్రమేకాదు. రెండు ఆత్మలు, రెండు శరీరాలు, రెండు ఆశ యాలు, రెండు జీవితాలను జన్మ కడ దాక కలిపి ఉంచే ప్రకృతి శక్తి ఆ శక్తిని మనిషి రెండు ముక్కలుగా త్రుంచేస్తు న్నాడు. ఇది చూస్తూ ప్రకృతి ఎదురు తిరగదే. ప్రళయం రాదే

అసనిలోని సకు శక్తులు చేతుల్లోకి త్రోసుకొచ్చి ఆ బంధాన్ని త్రెంచేసినయి. ఈ జన్మకిక అవి కలవవు. రెండు పసుపు దారాలు నిర్జీవంగా పేలవంగా ఉన్నాయి. పసుపుకొమ్ము నలిగిపోయి తునిగిపోయి దీనంగా ఉంది. అంతవరకూ మౌనంగ ఉన్న కళ్ళు రెండు కన్నీటి బొట్లను తన చేతిమీదకు వర్షించినయి. ఇంకిపోయిన గుండెల్లో నుంచి రక్తం ఇగిరి కన్నీళ్ళుగా మారి వచ్చినట్లుంది వెచ్చటి కన్నీటి బిందువులు అతని చేతిమీద నిప్పుకణి కల్లా మెరుస్తున్నయి. చేతులు దహించుకు పోతున్న అనుభూతిని పొందుతున్నాయి. అతనక్కడ నిలువలేక బయటకు పరుగెత్తాడు.

జకరయ్య అమెను ఆర్తిగా చూస్తు

న్నాడు. కసిగాను, చిరాగ్గానూ చూస్తున్నాడు. అతని కామెను ఏదో చేయాలని ఉంది ఆ కసితో ఏవో ప్రశ్నలు వేస్తున్నాడు. నోటికొచ్చినట్లు తిడుతున్నాడు. అతని ప్రశ్నలన్నిటికీ సమాధానంగా ఒక్కసారి తలఎత్తి చూసింది. కసిస్తువ్వట్లు చూసింది. ఎర్రటి బొట్టు ఇంకా ఎర్రగామారి హోమాగ్నిలా ఉంది. ఆ బొట్టును చూస్తూంటే జకరయ్యలో ఇంకా కసి పెరిగిపోతుంది.

“ఏమే లంజ! పొద్దునే ముస్తాబయ్యావేమే” అని కసురుతున్నాడు. ఆమె మళ్ళీ తల ఎత్తి చూచింది. ఆ చూపుల్లో అతన్ని భయపెట్టే రుద్రులు కనిపిస్తున్నారు. కంటికొనల ఎర్రదనంలో వెల్లి ఖాండాలు కనిపిస్తున్నాయి. అతనిలో ఆ బొట్టు చూస్తున్న కొద్దీ మరింత ఎలర్జీ పుడుతుంది ఆ బొట్టును కసిగా తుడిచేయాలనుంది దానికి కారణం అతని సుప్త చైతన్యంలో ఉన్న మతప్రేరణ కూడా కావచ్చు.

“ఏమే! ఆ బొట్టు పెట్టుకొని పసుపు రాసి పెద్ద పతివ్రతలా తిరిగితే వదిలేస్తారనుకున్నావా. అవులిస్తే పేగులెక్కెడతాను. ఎన్నవేషాలు ఏస్తే బయటపడదనుకున్నావేమో రంకు ముండా! దేవరలా ఆ బొట్టేమిటి? తుడిచెయ్ అది” అంటూ ఆ బొట్టును లాఠీతో చెరిపాడు. ఆ కుంకుమ నుదురంతా పాకి ఆ నుదురు రుద్రకాళి నాలికలా ఉంది కళ్ళు కోపంతో భగ్గుమన్నాయి. అతన్ని దహించేలా చూస్తున్నాయి. ఆమెను చూస్తుంటే అతనిలో భయం పెరిగిపోతుంది. గొంతు తడారిపోతుంది. టేబుల్ మీద ఉన్న గ్లాసులో నీళ్ళు సగం తాగేసాడు. ఆమె ఇంకా అలానే చూస్తుంది. ఆ కుంకుమ అతన్ని భయపెడుతూనే ఉంది. భయంతో గ్లాసులో మిగిలిన నీళ్ళు ఆమె ముఖంమీద చిమ్మాడు. కుంకుమ నీళ్ళతో కలిసి రక్తంలా కారింది. ముఖంపై కుంకుమ నీళ్ళు ఎర్రగా మెరిసినయి. ఆ నీటి బిందువుల్లో జాతి, సంస్కృతి పగిలిపోయి ముక్కలు ముక్కలుగ కనిపిస్తుంది. ఆమెను చూసే ధైర్యంలేక ఆమెను సెల్‌లోకి తోశాడు.

* * *

పున్నమ్మ జైలుగోడ కానుకొని కూర్చుంది ఊరు చీకటంతా ఆ గదిలోనే ఉంది. ఆమెలో ఆశతోపాటు ఆకలి చచ్చిపోయింది. ఆమె శోకదేవతలా ఉంది. చీకటిలా ఉంది. కాని కాంతిలా మెరుస్తుంది. సుషుప్తిలా ఉంది. కాని చైతన్యం కడుపులో దాచుకుంది. విరాగినిలా ఉంది కాంతి, చైతన్యం విప్లవం ఇవన్నీ చీకట్లో బంధించినట్లుంది.

నైట్ డ్యూటీ కానిస్టేబుల్ నల్లమందు మింగి నిద్రపోతున్నాడు. జకరయ్య మెల్లగ తూలుతూ ఆ గదిలో ప్రవేశించాడు. చేతిలో బ్యాటరీ లైటు వెలుగులు కక్కుతుంది కాంతి ఆమె



మీద పడింది. అతను చీకట్లోనే మిగిలిపోయి కాంతితో చీకటిని చూస్తున్నాడు కాని కాంతిని చూడలేకపోతున్నాడు. ఆమె కదలలేదు. మెదలలేదు.

అతనామె దగ్గర జరిగాడు. మౌనంగా తలవంచు కూర్చుందామె. ఆమెను పడుకోబెట్టాడు. ఆమె ఎదురు తిరగ లేదు దానివల్ల ఫలితం శూన్యం. అతనామెను ఆర్తిగా ఆక్రమించుకుంటున్నాడు. ఆమె కళ్ళు మూసుకొని పడుకుంది ఆమెలో చలనం లేదు. తిరుగుబాటు లేదు. ఆ శరీరం తనది కాదన్నట్లు మౌనంగా ఉంది. ఆ శరీరం ఇంకా ఎవరికి కావాలి. కావాల్సినవాడు బంధం త్రెంచుకొని పోయాడు. కసిగా అనుభవించాలని వస్తున్న అతన్ని చూసి ఆమె నవ్వింది జాలిపడుతున్నట్లు జీవన సారాన్ని కాచి వడపోసిన వేదాంతిలా నవ్వింది. ప్రతిదానికోసం ఎగబడే బిడ్డను చూసి తల్లి నవ్వినట్లుంది. ఆ నవ్వు పురుషుడి బలహీనతలు చూసి స్త్రీ ఎపుడూ జాలిపడుతూనే ఉంది

జీవిత పాఠశాలలో చదువుకున్న పాఠాలతో, అనుభవాలతో రాటుతేలిపోయిన మనస్సుతో ఆమె ఆలోచిస్తుంది. అతనామెను నగ్నంగా చేస్తుంటే నవ్వుకుంది ఈ శరీరాన్ని నగ్నంగా చేసి అవమానపరుస్తాడు కాని తన ఆత్మ నత దేమీ చేయలేడుగా. చిన్నప్పుడు పాలు కుడిచిన రొమ్ముల్లాంటి రొమ్ముతో ఇప్పుడు కామదాహం తీర్చుకుంటున్నాడు. [తన తల్లిని, చెల్లిని తనలో నగ్నంగా చూసుకుంటున్నాడని అతని మీద జాలిపడుతుందామె] అతను పశువులా ప్రవర్తిస్తున్నాడు. పెదవులు చెంపలు కసిగా కొరుకుతున్నాడు. ఆమెకు ఎలాంటి బాధ కల్గటం లేదు ఆ గాయాలు నుంచి రక్తం కారుతుంటే తాను మరింత పరి

శుద్ధమవుతున్న అనుభూతి పొందుతుం దామె. అతని దాహం తీరాక ఆమె నుంచి వేరయి లేచి వెళ్ళిపోయాడు. మనిషికి జంతువుకి ఉన్న తేడా ఒక్కటే. జంతువులు మనుషుల్లాగా రాక్షసంగా రమించవు.

మరుపటి రోజు సి. ఐ. వచ్చాడు. అతను ఆఫీసుకు రాలేదు ఊరి సర్పంచ్ గారింట్లో దన ఆఫీసులో ఫైళ్ళు వారి దగ్గరకు కదిలి వెళ్ళినయి. వాటితో పాటు బహుమానాలు కూడ. ఆ రాత్రి కోళ్ళు తలలు తెగినయి. విస్కీ బుడ్ల తలలు తెగినయి. సి. ఐ. గారు మంచి ఏర్పాట్లు చేసినందుకు ఆనందించారు. ఇంకా ఏదో కొస్త వెలితి కనిపించింది. రాత్రి పదింటికి ఆ వెలితి కూడ తీర్చారు భక్తులంతా. పున్నమ్మని బలిపశువులా అలంకరించి పంపారు. ఆ కానుకతో సి. ఐ. గారు మరింత సంబరపడి స్టాఫ్ స్వామిభక్తిని కొనియాడారు.

జీవమున్న మట్టిబొమ్మతో వారు కాలక్షేపం చేస్తూ త్రాగిన మత్తులో ఆమెను విడదుల చేస్తామని హామీ ఇచ్చారు. అందు కామె నవ్వుతుంది. తనకు ఈ ప్రపంచంనుంచే విడుదల కావాలి. అది ఆ భగవంతుడు తప్ప ఎవ్వరివ్వగలరు.

తెల్లారాక ఊరంతా గందరగోళ మయ్యింది. సి. ఐ. పడుకున్నా గది కిటికీకి ఊచలకు చీరతో ఉరేసుకున్న శవాన్ని అందరూ వింతగా చూసారు. ఎవ్వర్నీ ఎవరూ ప్రశ్నించలేదు. ఏట వాలుగ వ్రేలాడుతున్న శవం గ్రుడ్లు వెళ్ళుకొచ్చి నగ్నంగా వికృతంగా ఉంది. ఆ నగ్నత్వాన్ని ఎవ్వరూ చూడలేక పోతున్నారు. దానికోసమై పడి చచ్చిన జీతరయ్య కూడ కళ్ళుమూసుకొని గుడ్డ కప్పాడు.

ఆ గదిలో ఆ రాత్రి ఉన్న వ్యక్తి కోసం ఆచూకీ తీస్తామని సి ఐ. గారు పూరి ప్రజలకు హామీ ఇచ్చారు. ఊరి ప్రజలు సి. ఐ వ్యక్తిత్వం మెచ్చు కున్నారు. మున్సిపాలిటీవాళ్ళు, పోలీసులు శవాన్ని ఊరేగించి పాతేసారు. తలకొరివి పెట్టేందుకు ఎవ్వరూ లేక ఊరంతా చందాలేసుకుంది పూడ్చేయటానికి.

ఆ తర్వాత రెండ్రోజులకి గన్నేరు కాయలు తిని చచ్చిపోయిన రాఘవ తల్లీ, తండ్రీ, తమ్ముళ్ళ శవాలను మున్సి పాలిటీ బండి తోలుకుపోయింది.

రాఘవ మాత్రం ఆ ఊరి పిచ్చి వాడిలా ఇంకా చెలామణి అవుతున్నాడు. అతని పిచ్చి బ్రతుకు పిచ్చి .... బ్రతుకు వ్యామోహం తీరాక అతను ఎపుడో ఒకపుడు రాలిపోతాడు ...... అతను ఈ దేశపు నగటు మనిషే... బాధ్య తెరిగిన పౌరుడే.